సాక్షి
కుమురం భీం

మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024

దర్బార్‌లో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, పక్కన ఎంపీ సోయం, ఎమ్మెల్యే బొజ్జు, కలెక్టర్ రాహుల్‌రాజ్, పీవో ఖుష్బూ గుప్తా తదితరులు



న్యూస్‌రీల్

ఎక్సైజ్ శాఖలో బదిలీలు

ఆసిఫాబాద్: జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు ఎక్సైజ్ సీఐలు, ఎస్సైలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆ శాఖ కమిషనర్ శ్రీధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆసిఫాబాద్ ఎక్సైజ్ సీఐ మోసిన్ అలీ కరీంనగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా బదిలీ కాగా, బెల్లంపల్లి సీఐ డి.దీపక్ ఆసిఫాబాద్‌కు బదిలీ అయ్యారు. కాగజ్‌నగర్ సీఐ మంగమ్మ రామగుండం ఎస్‌హెచ్‌వోగా బదిలీ కాగా, ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పి.సామ్యూల్ జాన్ ఆమె స్థానంలో కాగజ్‌నగర్‌కు రానున్నారు. అలాగే ఆసిఫాబాద్ ఎక్సైజ్ ఎస్సై కె.విజయలక్ష్మి ఆదిలాబాద్‌కు, టి.నర్సింహచారిని నిజామాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ చేశారు. ఖైంసాలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్.రమేశ్ కుమార్, ఆదిలాబాద్ ఎస్సై కె.సంధ్యారాణి, ఇచ్చోడ ఎస్సై పి.రాజేశ్వర్ జిల్లాకు రానున్నారు.

జెడ్పీ సీఈవో రత్నమాల బదిలీ

ఆసిఫాబాద్: జిల్లా పరిషత్ సీఈవో టీడీ రత్నమాల ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. హైదరాబాద్ నుంచి ఈ.అనిల్‌కుమార్ జెడ్పీ సీఈవోగా కుమురంభీం జిల్లాకు రానున్నారు. వీరితో పాటు అడిషనల్ డీఆర్‌డీవో, ఇన్‌చార్జి డిప్యూటీ సీఈవో కుటుంబరావు సైతం ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మంచిర్యాల డిప్యూటీ సీఈవో ఆర్.లక్ష్మీనారాయణకు బాధ్యతలు అప్పగించారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు సీఈవోలు, డిప్యూటీ సీఈవోలను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'మార్కెట్ చైర్‌పర్సన్‌పై దాడి అమానుషం'

ఆసిఫాబాద్: అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణ గుప్తాపై రైతులు దాడి చేయడం అమానుషమని ఆర్యవైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్కెట్ చైర్‌పర్సన్‌పై దాడిని తీవ్రంగా ఖండించారు. మహిళ అని చూడకుండా దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. తూకాల్లో మోసాలు జరిగినా.. గిట్టుబాటు ధర లభించకపోయినా అధికారులకు ఫిర్యాదు చేయాలని, ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సరికాదని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న సీఐ నాగరాజు

పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని హనుమాన్ విగ్రహం వెనుక గ్రామస్తులు, అటవీశాఖ మధ్య వివాదానికి కారణమైన అటవీ కార్యాలయ నిర్మాణ స్థలాన్ని సోమవారం సీఐ నాగరాజు.. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎఫ్ఆర్‌వో సుధాకర్‌తో కలిసి పరిశీలించారు. కొన్నేళ్లుగా సదరు స్థలాన్ని గ్రామ శ్మశాన వాటికగా వినియోగిస్తున్నామని, అక్కడ అటవీశాఖ కార్యాలయ నిర్మాణం ప్రారంభించడంతో అడ్డుకున్నామని గ్రామస్తులు తెలిపారు. అటవీశాఖ భూమిలో కార్యాలయ నిర్మాణం చేపడితే పలుమార్లు గ్రామస్తులు అడ్డుకుంటూ వివాదానికి తెరదీస్తున్నారని ఫారెస్ట్ అధికారులు సీఐ దృష్టికి తీసుకువచ్చారు. అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు సర్వే నిర్వహించి సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని సీఐ సూచించారు. ఆయన వెంట పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్య, గ్రామస్తులు ఉన్నారు.

18న టాలెంట్ టెస్ట్

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి విద్యార్థుల కోసం ఈ నెల 18న జిల్లా వ్యాప్తంగా టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్, ప్రధాన కార్యదర్శి భీమేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు ముందు నిర్వహించే ఈ టాలెంట్ టెస్టును వినియోగించుకోవాలని కోరారు. అధ్యయనం, పోరాటం అనే ఆచరణాత్మక నినాదాన్ని ముందుకు తీసుకెళ్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీసేందుకు ఈ పరీక్ష ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు పాఠశాలల హెచ్‌ఎంలు లేదా 93810 46472, 88865 61367 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఉత్తమ మార్కులు సాధించిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, నాయకులు సాయి, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వంతో పనిచేద్దాం



- ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొద్దాం
- హైమన్‌డార్ఫ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి
- ఉమ్మడి ఆదిలాబాద్ అభివృద్ధికి సీఎం కట్టుబడి ఉన్నారు
- గిరిజన దర్బార్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



దర్బార్‌కు హాజరైన జనం

సాక్షి,ఆదిలాబాద్: కల్మషం లేని అమాయకులైన ఈ ప్రాంత ప్రజల అభ్యున్నతి కోసం అధికారులు చిత్తశుద్ధితో పాటు మానవత్వంతో పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. అలాంటి వారిని చరిత్ర మరిచిపోదని వివరించారు. పోరాటవీరుడు కుమురంభీం, ఆదివాసీల అభ్యున్నతికి పాల్పడిన హైమన్‌డార్ఫ్‌ను ఇక్కడి ప్రజలు గుండెల్లో పెట్టుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. డార్ఫ్ తన కొడుకుకు లచ్చు పటేల్ అని పేరు పెట్టుకున్నారంటే ఈ ప్రాంతం, ఈ ప్రజలతో ఆయనకు ఏర్పడిన అనుబంధాన్ని మనకు తెలుపుతుందన్నారు. ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి సీతక్క మొదట నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దర్బార్‌లో పాల్గొని ఆదివాసీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వెనుకబడిన ప్రాంతమైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తనను ఇన్‌చార్జి మంత్రిగా నియమించినప్పుడు ఇక్కడికి రావడం అదృష్టంగా భావించానన్నారు. 'నేను పుట్టింది.. ఉద్యమంలో ఉంది ఇటువంటి ప్రాంతంలోనే.. ఇలాంటి ప్రజల కోసం నేను కాకపోతే ఇంకెవరు పనిచేయాలి అనుకున్నానని ఆమె అన్నారు.' ఈ దర్బార్‌లో కుమురంభీం, హైమన్‌డార్ఫ్ వంటి మహనీయుల చిత్రపటాలు ఉండాలని, వారి చరిత్రను శిలా ఫలకాలపై రూపొందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. పోరా టాల గడ్డ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. దర్బార్ ప్రాముఖ్యతను కూడా తెలియజేయాలన్నారు. రాజకీయాలకతీతంగా అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. ఉద్యోగ, ఉపాధిఅవకాశాలను పెంపొందించడంతోపాటు విద్య, వైద్య సదుపాయాలు మెరుగుపర్చాలని సూచించారు. పోడు పట్టాల సమస్యను పరిష్కరిస్తామన్నారు. రోడ్డు, రవాణా మార్గాలను అభివృద్ధి చేస్తామన్నారు. నీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. అందరి ఎజెండా ఒకటేనని, ప్రజల జీవితాల్లో మార్పునకు పాటుపడాలన్నారు. మేడారం తర్వాత మళ్లీ ఇక్కడికి వస్తానన్నారు. విజ్ఞప్తులను శాఖలు, గ్రామా ల వారీగా పరిష్కరిస్తామని వివరించారు. ముందుగా ఆలయ సమీపంలో గోవాడ్ వద్ద మెస్రం మహిళలతో సీతక్క ముచ్చటించారు.

జీవో నం.3 కొనసాగించాలి



జీవో నం.3 రావాలని ఆదివాసీలు కోరుకుంటున్నారు. సుప్రీంకోర్టు ఈ జీవోకు వ్యతిరేకంగా తీర్పునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా ఈ జీవోను కొనసాగించాలి. అటవీ ప్రాంతాల్లో గిరిజనులను ఫారెస్ట్ అధికారులు కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారు.. ఈ సమస్యను పరిష్కరించాలి. పోడు పట్టాల కల్పనతో పాటు ఆదివాసీల సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వం విఫలమైంది. రాష్ట్రంలో రెండు లక్షల ఆదివాసీలకు పోడు పట్టాలు ఇవ్వాలి. చట్టబద్ధత లేని కులాలను ఎస్టీల నుంచి తొలగించాలి. పీవీటీజీ తెగల అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి మోదీ జన్‌మన్ పథకాన్ని తీసుకురావడం జరిగింది.

–సోయం బాపూరావు, ఆదిలాబాద్ ఎంపీ

విద్య, వైద్యం అభివృద్ధికి పాటుపడాలి



విద్య, వైద్యంతో పాటు వ్యవసాయ అభివృద్ధికి తోడ్పాటునందించాలి. ఈ ప్రాంతంలోని చారిత్రాత్మక ప్రదేశాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు మంత్రి సీతక్క తోడ్పాటు నందించాలి. ఉట్నూర్ ప్రాంతంలో జీఎన్‌ఎం లేనిపక్షంలో ఏఎన్‌ఎం వంటి కళాశాలలు ఏర్పాటు చేయాలి. ఇటీవల జిల్లాలో పర్యటించిన సీఎం ఈ ప్రాంత అభివృద్ధికి అనేక నిధులు కేటాయించారు.46, 317 జీఓలతో ఇబ్బందిగా ఉంది. ముఖ్యమంత్రితో ఈ విషయంపై మాట్లాడి ఆ జీఓలను తొలగించే విధంగా చూడాలి.

– వెడ్మ బొజ్జు పటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే

విజ్ఞప్తులను మినట్స్‌గా రూపొందిస్తాం



ఆదివాసీల అభ్యున్నతి కోసం ఏడు ముఖ్యమైన ప్రణాళికలు రూపొందించాం. ఆ ప్రకారం ముందుకెళ్తున్నాం. విద్య, వైద్య ప్రమాణాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. 400 హ్యాబిటేషన్లకు త్రిఫేజ్ కరెంటు సౌకర్యం కల్పిస్తున్నాం. దర్బార్‌లో వచ్చినటువంటి విజ్ఞప్తులను మినట్స్‌గా రూపొందిస్తాం. పరిష్కార యోగ్యమైనటువంటి విజ్ఞప్తులపై తక్షణం స్పందించేలా చర్యలు తీసుకుంటాం. ఇక్కడ పరిష్కార మార్గం లేనివి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

– రాహుల్ రాజ్, ఆదిలాబాద్ కలెక్టర్


పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీస్‌గా వ్యవహరిస్తున్నాం



ముప్పై, నలభై ఏళ్ల క్రితం పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసేందుకు భయపడేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ఈ ప్రాంత ప్రజలు ఏదైన ఫిర్యాదు చేయాలంటే స్టేషన్‌కు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసుగా వ్యవహరిస్తున్నాం. నాగోబా జాతరలో 500 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

– గౌస్ ఆలం, ఆదిలాబాద్ ఎస్పీ

దీపావళి సెలవులు పొడిగించాలి



ఆదివాసీలు దీపావళి పండగను ఘనంగా జరుపుకుంటారు. దసరా కంటే దీపావళి సమయంలో ఇచ్చే సెలవులను మా పిల్లలకు పొడిగించాలి. విద్య, వైద్యంలో వెనుకబడి ఉన్నాం. వీటి అభ్యున్నతికి ప్రజాప్రతినిధులు పాటుపడాలి.

– మెస్రం వెంకట్‌రావు, నాగోబా ఆలయ పూజారి

జన జాతర

- భక్తజన సంద్రంగా కేస్లాపూర్
- ఆలయంలో ప్రత్యేక పూజలు



మంత్రికి నాగోబా చిత్రపటం అందజేస్తూ..

క్యూలో బారులు తీరిన భక్తులు



ఇంద్రవెల్లి: నాగోబాజాతర వైభవంగా కొనసాగుతుంది. సోమవారం దర్బార్ నిర్వహించడంతో ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా తెలంగాణ, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిల్చొని నాగోబాను దర్శించుకున్నారు. దర్బార్ అనంతరం హాజరైన అతిథులుకు మెస్రం వంశీయులు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం తలపాగా కట్టి పూజలకు తీసుకెళ్లారు. అనంతరం శాలువాలతో సన్మానించి నాగోబా ప్రతిమలు అందించారు. ఇందులో ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్, వంశ పెద్దలు బాదిపటేల్, కోసు కటోడ, కోసేరావ్, మెస్రం వంశ ఉద్యోగులు తదితరులున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

నాగోబా దర్బార్ సమావేశంలో భాగంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు దరఖాస్తు స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చిన ఆదివాసీ గిరిజనులు ఎక్కువగా గిరి వికాసం పథకంలో భాగంగా వ్యవసాయ బోరు బావులు, భూహక్కు పత్రాలు, ఎడ్ల జతలు, ఎడ్ల బండ్లు, ఉపాధి కోసం ట్రైకార్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.



భక్త జనసంద్రంగా మారిన కేస్లాపూర్

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

దర్బార్ సమావేశంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల పాఠశాలల విద్యార్థులు, భద్రాచలం ఆదివాసీ కళాకారులు, ఆంధ్ ఆదివాసీ, నాయక్‌పోడ్ ఆదివాసీలు చేసిన థింసా, గుస్సాడి, సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.



సాంస్కృతిక ప్రదర్శనలో ఆదివాసీలు

'ఉపాధి'కి ప్రణాళికలు

- 2024- 25 ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపు
- 38,32,763 పనిదినాలకు ప్రతిపాదనలు
- ఇప్పటికే ఆయా గ్రామ పంచాయతీల్లో తీర్మానం

మండలాల వారీగా పని దినాలు

మండలం	పనిదినాలు
ఆసిఫాబాద్	3,33,770
బెజ్జూర్	3,15,451
చింతలమానెపల్లి	1,92,017
దహెగాం	3,21,855
జైనూర్	2,02,015
కాగజ్‌నగర్	2,90,975
కెరమెరి	3,49,515
కౌటాల	3,10,000
లింగాపూర్	1,65,220
పెంచికల్‌పేట్	1,52,090
రెబ్బెన	2,60,078
సిర్పూర్(టి)	1,86,320
సిర్పూర్(యూ)	2,69,000
తిర్యాణి	2,51,727
వాంకిడి	2,32,800

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధిహామీ పనులు కీలకంగా మారాయి. ప్రభుత్వం సైతం ఉపాధిహామీ నిధులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం 2024- 25లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద జిల్లాలో కూలీలకు పనులను కల్పించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులు గుర్తించారు. ప్రతీ కుటుంబానికి వంద రోజుల ఉపాధి కల్పించడమే లక్ష్యంగా 38,32,763 పనిదినాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు రూ.347కోట్ల బడ్జెట్ అవసరమవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు.

శాశ్వత పనులకు ప్రాధాన్యం..

గ్రామాల నుంచి వలసలను నిరోధించి స్థానికంగా ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో జాతీయ ఉపాధిహామీ పథకం రూపుదిద్దుకుంది. అయితే ప్రారంభంలో నిధుల వినియోగం తీరుపై, నామమాత్రపు పనులు చేపట్టడంతో పథకం అమలుపై విమర్శలు వచ్చాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం ఏటా చేపట్టాల్సిన పనులను ముందుగానే గుర్తించి అవసరమైన నిధులు విడుదల చేసే విధంగా మార్పులు చేసింది. అలాగే కూలీల హాజరును పకడ్బందీగా నమోదు చేస్తూ పారదర్శకతను పెంచేందుకు చర్యలు తీసుకుంటుంది. 2024- 25 ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 15 మండలాల పరిధిలో చేపట్టాల్సిన పనులను 'ఉపాధి' సిబ్బంది ఇప్పటికే గుర్తించారు. మూడు నెలల ముందు నుంచే గ్రామ సభలు నిర్వహిస్తూ పంచాయతీల్లో అవసరమైన తీర్మానాలు చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో శాశ్వత పనులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఫాంపాండ్స్, బావుల పూడికతీత, వాలుకట్టలు, ఇంకుడు గుంతలు, భూముల చదును, కంపోస్ట్ పిట్లు, పండ్ల తోటలు, వ్యవసాయ షెడ్లు, మరుగుదొడ్లు, నర్సరీలు తదితర పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం 2023- 24 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం చేరుకునేందుకు ఉపాధిహామీ సిబ్బంది శ్రమిస్తున్నారు. కూలీలను పనికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 2024- 25 ఆర్థిక సంవత్సరంలోనూ ఉపాధి హామీ పథకంలో కూలీల పనిదినాలను పూర్తి చేసేందుకు అధికారులు ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నారు.

ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ



అర్జీ పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబానికి చెందిన తాము కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నామని, ఉపాధి కల్పించాలని ఆసిఫాబాద్ మండలం మోతుగూడకు చెందిన విజయలక్ష్మి, బార్ల బానక్క, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఎస్.బాబురావు వేర్వేరుగా దరఖాస్తు చేసుకున్నారు. డిగ్రీ పూర్తి చేసిన తనకు ఏదైన ఉపాధి కల్పించాలని ఆసిఫాబాద్‌కు చెందిన కొండ్ర పార్వతి దరఖాస్తు చేసుకుంది. తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని ముగ్గురు అన్నదమ్ములకు సమాన వాటాలు ఇప్పించాలని రెబ్బెన మండలం నారాయణపూర్‌కు చెందిన మాదాసు కిష్టయ్య దరఖాస్తు చేసుకున్నాడు. ఆధార్ కార్డు లేక పింఛన్ రావడం లేదని, వృద్ధాప్యంలో బాగోగులు చూసేవారు లేరని.. ప్రభుత్వం స్పందించి ఆసరా పింఛన్ మంజూరు చేయాలని కాగజ్‌నగర్‌కు చెందిన ఓంపెల్లి సత్తమ్మ వేడుకుంది. రెండేళ్ల క్రితం గొర్రెల కోసం రూ.43,755 డబ్బులు చెల్లించానని, గొర్రెలు ఇవ్వడం లేదని, తమ డబ్బులు వాపస్ ఇవ్వాలని బెజ్జూర్ మండలం మర్తిడికి చెందిన జాజిమొగ్గ దమయంతి, ఆరె గౌరు, లక్ష్మి దరఖాస్తు చేసుకున్నారు. వీరితోపాటు పలువురు సమస్యలు పరిష్కరించాలని అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్ లేదు



మాకు ముగ్గురికి కలిపి 15 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గిరివికాస్ పథకం కింద ఏడాది క్రితం బోర్ వేశారు. విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు.. మోటార్ బిగించలేదు. ఆయిల్‌పాం, పత్తి పంట సాగు చేశాం. సాగునీరు లేకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా చేయాలి.

– ఆత్రం బాపు, ఎలాది జనార్దన్, గుండెపల్లి

కన్ను కనిపించదు



నాకు ఎడమ కన్ను కనిపించదు. వృద్ధాప్యంలో కుటుంబ పోషణ భారంగా ఉంది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. సదరం సర్టిఫికెట్ ఇప్పించి, పింఛన్ మంజూరు చేయాలి.

– టాక్సుండి పోశెట్టి, దానాపూర్, మం.ఆసిఫాబాద్

అటవీహక్కు పట్టా ఇవ్వాలి



గత కొన్ని సంవత్సరాలుగా డబ్బా గ్రామంలో ఐదెకరాల అటవీ భూమి సాగు చేసుకుంటున్నా. ఎస్టీ మన్నెవార్ సామాజిక వర్గానికి చెందిన నాకు అటవీహక్కు పట్టా జారీ చేయాలి. రైతుబంధు పథకం వర్తింపజేయాలి.

– మంగిడి లక్ష్మి, డబ్బా, చింతలమానెపల్లి

ఉపాధి కల్పించాలి



పదో తరగతి వరకు చదువుకున్నాను. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా. ప్రభుత్వ కార్యాలయాల్లో వాచ్‌మెన్ ఉద్యోగం కల్పించాలి.


– ఉప్పరి తిరుపతి, మోతుగూడ, మం.ఆసిఫాబాద్

వారంలోగా ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

ఆసిఫాబాద్: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అర్జీదారులు చేసుకున్న దరఖాస్తుల పరిష్కారం, తిరస్కరణ వివరాలను సంబంధిత అర్జీదారుడికి లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్నవాటి వివరాలను ప్రతిరోజూ నివేదిక అందించాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ దీపక్ తివారి కాగజ్‌నగర్ ఆర్డీవో సురేశ్‌తో కలిసి అన్ని మండలాలకు చెందిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లతో ప్రజావాణి దరఖాస్తుల నిర్వహణపై సమావేశమయ్యారు.

క్లుప్తంగా

మద్యం మత్తులో వ్యక్తి మృతి



శివకృష్ణ (ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని టేకులబస్తీలో ఓ వ్యక్తి మద్యం మత్తులో మృతి చెందిన ఘటన సోమవారం వెలుగుచూసింది. వన్‌టౌన్ అడిషనల్ ఎస్సై రమేశ్ వివరాల ప్రకారం... మియాపురం శివకృష్ణ(35) కుటుంబీకులు శనివారం వేరే ఊరికి వెళ్లారు. కుటుంబ సభ్యులు ఇంట్లో ఎవరు లేకపోవడంతో శివకృష్ణ అదేరోజు రాత్రి అతిగా మద్యం తాగి కింద కూర్చోని అన్నం తింటూ ప్లేట్‌లో తలకిందులుగా పడిపోయాడు. అతిగా మద్యం తాగి తల కిందులుగా పడడంతో ఊపిరాడక మృతిచెంది ఉంటాడని ఎస్సై అనుమానం వ్యక్తం చేశాడు. మృతుడి తల్లి మియాపురం భూలక్ష్మి సోమవారం ఇంటికి శివకృష్ణ మృతి చెంది కనిపించాడు. శివకృష్ణకు పెళ్లి కాగా భార్య కాపురానికి రాకుండా పుట్టింట్లో ఉండిపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యం బాటిళ్లతో నిందితులు

ఆసిఫాబాద్/వాంకిడి: జిల్లా సరిహద్దులోని వాంకిడి ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద సోమవారం తెల్లవారుజామున నిర్వహించిన తనిఖీల్లో ఢిల్లీ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న 36 జానీవాకర్ బ్లాక్ లేబుల్ మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మోసిన్ అలీ తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. ఇందులో మద్యం బాటిళ్లను పట్టుకుని కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన షేక్ మాబుసుబాని, శేరి వేల్పూర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళకు గాయాలు

కౌటాల: మండల కేంద్రంలోని మినీ స్టేడియం సమీపంలో కౌటాల– కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ముత్తంపేట్ గ్రామానికి చెందిన సుమన్‌బాయి తన సమీప బంధువైన సురేష్‌తో కలిసి బైక్ పై సోమవారం వారసంతకు వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో మినీస్టేడియం సమీపంలోని మూల మలుపు వద్ద వెనుక నుంచి బైక్ ఢీకొట్టింది. దీంతో సుమన్‌బాయి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై మధుకర్ సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రురాలును అంబులెన్స్‌లో కాగజ్‌నగర్‌కు తరలించారు.

వాహనాల తనిఖీ

మంచిర్యాలక్రైం: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆర్టీఏ అధికారులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల వద్ద రహదారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల పత్రాలు, ఇన్సురెన్స్, పొల్యూషన్ పత్రాలు లేనివారికి జరిమానాలు విధించారు. 20 వాహనాలపై కేసు నమోదు చేశారు. అనంతరం ఎంవీఐ వివేకానందరెడ్డి మాట్లాడుతూ వాహనదారులు విధిగా హెల్మెట్ వినియోగించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంవీఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కాలగర్భంలోకి మరో గని

- వచ్చే ఏడాది ఆగస్టులో ఆర్కే 6గని మూసివేత
- నిల్వలు అడుగంటడంతో నిర్ణయం
- ఇంకా 15.02 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు
- కార్మికుల్లో బదిలీ ఆందోళన



పని స్థలాల్లో ఉత్పత్తిపై సమీక్ష చేస్తున్న అధికారులు(ఫైల్)



ఆర్కే 6గని ముఖ ద్వారం

గని ఏర్పాటు: 06-04-1975
మూసివేత తేదీ: 31-7-2025
పనిచేస్తున్న ఉద్యోగులు: 875
గుర్తించిన బొగ్గు నిల్వలు: 29.80 మిలియన్ టన్నులు
తీయడానికి అనుకూలంగా ఉన్న నిల్వలు: 14.78 మిలియన్ టన్నులు
ఇప్పటికి తీసినవి: 14.10 మిలియన్ టన్నులు
ఓసీపీ ద్వారా తీయనున్న నిల్వలు: 15.02 మిలియన్ టన్నులు

శ్రీరాంపూర్: సింగరేణిలో మరో భూగర్భగని మూసివేతకు రంగం సిద్ధమైంది. అధిక భూగర్భ గనులు ఉన్న శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 6 గని ఆగస్టు 31, 2025కు మూసివేయడానికి కంపెనీ పూనుకుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తోంది. సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ గని మూసివేతకు రంగం సిద్ధం కావడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఈ గని 06-04-1975లో ఏర్పాటైంది. అర్ధ శతాబ్దపు జీవిత కాలం తరువాత గని కాలగర్భంలో కలిసిపోనుండడంతో ఆందోళన కలిగిస్తోంది. ఏరియాలోనే అత్యధిక కార్మికులు ఈ గనిలో పనిచేసిన చరిత్ర ఉంది. మెకనైజేషన్ కాకముందు తట్టా, చెమ్మస్‌తో సంప్రదాయ పద్ధతిలో బొగ్గు తీసిన రోజుల్లో ఈగని వెలుగువెలిగింది. కార్మికులు, కార్మిక సంఘాల నేతలు కూడా ఈగనిలోనే చాలా మంది పనిచేసిన వారు కావడంతో నిత్యం వార్తల్లో ఉండేది. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనతో పాటు రక్షణతో ఉత్పత్తి సాధించడంలో కూడా గని కీలక పాత్ర పోషించింది. దీనికి ఆనుకొని 6ఏ టన్నెల్ ద్వారా కూడా కొద్ది కాలం బొగ్గు తీశారు. ఈ గని ప్రారంభంలో 8 సీమ్‌లతో బొగ్గు తీశారు. 1ఏ, 1ఎస్, 2ఏ, 2బీ, 2, 3, 4, 5 సీమ్‌లలో నుంచి బొగ్గు తీశారు. ప్రస్తుతం మూసివేతకు దగ్గర ఉన్న ఈ సమయంలో కేవలం 4, 5 సీమ్‌లు మాత్రమే నడుస్తున్నాయి. ఎస్‌డీఎల్ సెక్షన్‌లో బొగ్గు ఉత్పత్తిని సాధించడంతో కంపెనీలోనే ఈ గని ప్రథమ స్థానంలో ఉండి పలు అవార్డులను సాధించింది. రక్షణలో కూడా అవార్డులను సొంతం చేసుకున్న చరిత్ర ఈ గనికే దక్కింది.

ఇప్పటికే 4 గనులు మూసివేత..

శ్రీరాంపూర్ ఏరియా ఏర్పడ్డ తరువాత ఎస్సార్పీ 1, ఎస్సార్పీ 2, ఎస్సార్పీ 2ఏ, ఎస్సార్పీ 3, 3ఏ, ఆర్కే 5, ఆర్కే 6, ఆర్కే 7, ఆర్కే న్యూటెక్, ఆర్కే 8, ఇందారం 1, ఇందారం 1ఏ గనులు నడిచాయి. కాలక్రమేణా భూగర్భ మైనింగ్‌తో బొగ్గు తీయడం సాధ్యం కావపోవడంతో ఎస్సార్పీ 2, ఎస్సార్పీ 2ఏ గనులను 20 ఏళ్ల క్రితమే మూసివేసి వాటి స్థానంలో ఎస్సార్పీ ఓసీపీని, తరువాత ఇందారం 1 గని మూసి వేసి ఇందారం ఓసీపీని, సంవత్సరం క్రితం ఆర్కే 8 గనిని కూడా మూసివేశారు. ఇప్పుడు ఆర్కే 6 గని వంతు వచ్చింది.

దసరాకు సంబురం...

దసరా పండుగకు ఈ గనికి ఎంతో అవినాభవ సంబంధం ఉంది. ఈ గనిపై ఉన్న సమ్మక్క ఆలయంలో దసరాకు దుర్గామాతను ప్రతిష్ఠిస్తారు. అమ్మవారిని దర్శించుకోవడం కోసం చుట్టు పక్కల కాలనీ నుంచి వేలాది మంది కార్మిక కుటుంబాలు దసరా రోజును ఇక్కడికి వస్తారు. జమ్మి పూజ కూడా ఘనంగా చేస్తారు. ఇప్పుడు ఈ గని మూసివేస్తే దసరా ఉత్సవాలు ఎలా అని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.

లోతుల్లోకి వెళ్లడంతోనే..

అండర్‌గ్రౌండ్ మైనింగ్ విధానంలో 300 మీటర్ల లోతుల్లో వరకు వెళ్లి బొగ్గు తీసే వీలుంది. అంత కంటే ఎక్కువగా వెళ్లితే ఇప్పుడున్న టెక్నాలజీ ప్రకారం సేఫ్టీ కష్టంగా ఉందని, మిగిలిన నిల్వలు తీయాలంటే వీటి స్థానంలో ఓసీపీలు చేయడం తప్పడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ కారణం చేతనే భూగర్భ గనులు మూసివేస్తున్నట్లు యాజమాన్యం పేర్కొంటుంది.

మూసివేత తప్పదు



భూగర్భ గనుల్లో 300 మీటర్ల దాటిలోతుల్లో మిగిలిన ఉన్న జాతీయ సంపదతను తీయడానికి ప్రస్తుత పరిస్థితుల్లో ఓపెన్ కాస్టు మైనింగ్ ఒక్కటే దారి మిగిలి ఉంది. అందుకే గని మూసివేత తప్పదు. ఉద్యోగులను ఇక్కడి ఏరియాల్లోనే సర్దుబాటు చేయాలనే ఆలోచనలో యాజమాన్యం ఉంది. కార్మికులు ఆందోళన చెందవద్దు.

– తిరుపతి, ఆర్కే 6 గని మేనేజర్

బదిలీపై ఆందోళనలు..

ప్రస్తుతం 875 మంది ఉద్యోగులు గనిలో పని చేస్తున్నారు. గని మూసివేస్తే తమను ఎక్కడ సర్దుబాటు చేస్తారో అని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఈ గని మూసివేస్తే ఏ ఏరియాలకు బదిలీ చేస్తారోనని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు

కాసిపేట: అటవీ ప్రాంతంలో, పంట పొలాలు, చేన్లకు వన్యప్రాణుల వేటకు విద్యుత్ వైర్లు అమర్చితే కఠినచర్యలు తప్పవని ముత్యంపల్లి డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్ హెచ్చరించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు తగిలి ప్రవీణ్ అనే గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మృతిచెందడం బాధాకరమన్నారు. వన్యప్రాణుల కోసం అటవీ, అటవేతర ప్రాంతంలో విద్యుత్ తీగలు, వన్యప్రాణులను హతమార్చేందుకు నీటిలో విషం కలపడంతో పోలీసులు, అటవీ అధికారులు, ప్రజలు ప్రమాదానికి గురై మృత్యువాత పడే అవకాశం ఉందన్నారు. అలాంటి పనులకు దూరంగా ఉండాలని, లేకుంటే వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం మూడు నుంచి ఐదు సంవత్సరాలు జైలుశిక్ష, ఐదు లక్షల రూపాయల జరిమానా విధించనున్నట్లు వివరించారు. ఈ అంశంపై అటవీ సమీప గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేషనల్ అప్రెంటీషిప్ మేళాకు స్పందన



మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధి

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీషిప్ మేళాకి భారీ స్పందన వచ్చింది. హైదరాబాద్ సొలార్ ప్రిమియర్ కంపెనీ, కరీంనగర్ ఆదర్శ ఆటోమోటివ్స్ నుంచి ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 89మంది విద్యార్థులు హాజరు కాగా 45మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. ఐటీఐ ప్రిన్సిపల్ దేవానంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మేళాలో ట్రైనింగ్ ఆఫీసర్ సునీల్, జగన్‌మోహన్‌రెడ్డి, సేంస్థల ప్రతినిధులు సాయితేజ, రాహుల్ పాల్గొన్నారు.

యంత్రాలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఓటు జీఎం

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్కేపీ గ్రూప్ గనులు, డిపార్ట్‌మెంట్లపై సోమవారం మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ యంత్రాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను సాధించాలన్నారు. సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఈ సందర్భంగా వివరించారు. సంస్థ ముందు అనేక ప్రణాళికలు, మరెన్నో లక్ష్యాలు ఉన్నాయని వాటిని సాధించాలంటే ఉద్యోగులందరు సమష్టి తోడ్పాటు అవసరమన్నారు. కార్యక్రమంలో ఏజీఎం నాగరాజు, డీజీఎం ఐఈడీ రాజన్న, డీజీఎం బాలాజీ భగవతి, డీవైపీఎం మైత్రేయబంధు, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

అధికారులతో ఐఎన్టీయూసీ నేతల వాగ్వాదం



అధికారులతో వాదిస్తున్న జనక్ ప్రసాద్

శ్రీరాంపూర్: ఎస్ఆర్పీ–1 గనిలో కొట్టే వెంకటేష్ అనే కార్మికుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటనపై ఐఎన్టీయూసీ నాయకులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఐఎన్టీయూసీసెక్రెటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్, ఏరియా ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు సోమవారం గనిని సందర్శించారు. ఏజెంట్ గోపాల్‌సింగ్, గని మేనేజర్ విజయ్‌కుమార్‌తో వారు వాగ్వాదానికి దిగారు. అకారణంగా వెంకటేష్‌ను ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ నుంచి తీసివేసి జనరల్ షిఫ్ట్‌లో వేయడంతో ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని మండిపడ్డారు. అనంతరం నాయకులు జీఎంతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. చివరికి అధికారులు స్పందించి ఇంజినీరింగ్ డిపార్టుమెంట్‌లో తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వివాదం సర్దుమణిగింది. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షులు కలవేని శ్యాం, కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, నాయకులు తిరుపతిరెడ్డి, రావుల అనిల్, భీమ్ రవి, మహేందర్‌రెడ్డి, వెంగళ కుమార్‌స్వామి, నీలం సదయ్య పాల్గొన్నారు.

అధికారులను నిందించడం తగదు

శ్రీరాంపూర్: ఇటీవల ఎస్సార్పీ 1 గనిలో కొట్టె వెంకటేష్ అనే జనరల్ మజ్దూర్ ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనలో అధికారులపై నిందలు మోపడం సరికాదని అధికారుల సంఘం (సీఎంఓఏఐ) శ్రీరాంపూర్ బ్రాంచ్ నాయకులు తెలిపారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారుల సంఘం నాయకులు సమావేశంపై ఘటనపై చర్చించారు. వెంకటేష్‌కు ఇటీవల షిఫ్ట్ చేంజ్ ఆర్డర్ ఇవ్వడం జరిగిందని, దీనిపై ఆయన మనస్థాపం చెంది గని మేనేజర్ విజయ్ కుమార్ ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ఆత్మశాంతి చేకూరాలని(రిప్) అని పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమస్యలుంటే మేనేజ్‌మెంట్ దృష్టి లేదా యూనియన్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని, వ్యక్తిగతంగా ఇలా అధికారిని టార్గెట్ చేయడం సరికాదన్నారు. రెండు యూనియన్ల మధ్య జరుగుతున్న పోరుకు అధికారిని ఇబ్బందులకు గురి చేయడాన్ని తగదన్నారు. సమావేశంలో ఆ యూనియన్ అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, మహేశ్, జాయింట్ సెక్రెటరీలు ఆర్.భీమన్న, గౌస్‌పాషాలు, ఏజెంట్లు గోపాల్‌సింగ్, రాముడు, ఓసీపీ పీఓలు శ్రీనివాస్, పురుషోత్తంరెడ్డి, డీజీఎం అరవిందరావు పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాలు సీజ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అధిక లోడ్‌తో వెళ్తున్న రెండు ఇసుక వాహనాలను రవాణా శాఖ అధికారులు సీజ్ చేశారు. జిల్లా రవాణా శాఖ అధికారి ఎల్.కిష్టయ్య ఆదేశాల మేరకు ఏఎంవీఐ శ్రీకాంత్ ఇసుక వాహనాలను సీజ్ చేశారు. కోటపల్లి మండలం పలుగుల ఇసుక క్వారీ నుంచి ఓ లారీ, మరో టిప్పర్ అధిక లోడ్‌తో ఉన్నట్లు మంచిర్యాలలో నిర్వహించిన తనిఖీల్లో గుర్తించి సీజ్ చేశారు. ఒక ఇసుక లారీలో 5టన్నులు, టిప్పర్‌లో 7 టన్నుల ఇసుక ఓవర్ లోడ్ ఉన్నట్లు గుర్తించి లారీ, టిప్పర్ యజమానులు, డ్రైవర్లతో పాటు క్వారీ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఏఎంవీఐ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు డీటీవో కిష్టయ్య తెలిపారు. హోంగార్డులు నాగరాజు, నరేశ్ ఉన్నారు.

బాలిక కిడ్నాప్ కేసుపై విచారణ

- పోలీసుల అదుపులోని మహిళను తల్లిదండ్రులకు అప్పగింత
- సెల్‌ఫోన్ స్వాధీనం

మంచిర్యాలక్రైం: బాలిక కిడ్నాప్ కలకలం కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న దేవాపూర్‌కు చెందిన సుమిత్రకు 41ఏ సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ రవీందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... కాసిపేట మండలం చింతగూడకు చెందిన మడవి గణపతి–పార్వతిల కూతురు సుమిత్ర భర్తను వదిలేసింది. ఎనిమిదేళ్లుగా శ్రీనివాసగార్డెన్ ప్రాంతంలో ఒంటరిగా ఓ ఇంట్లో కిరాయికి ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆదివారం స్థానిక అపార్ట్‌మెంట్ వద్ద బాలికను తల్లిదండ్రులు మరిచి లిఫ్ట్‌లో వెళ్లిపోయారు. బాలిక అక్కడ ఏడవడంతో దగ్గరకు వెళ్లిన సుమిత్ర దగ్గరకు తీసుకోగా స్థానికులు వచ్చి ఆమెను పట్టుకున్నారు. సుమిత్ర బాలికను ఉద్దేశపూర్వకంగా తీసుకెళ్లలేదని, సుమిత్రకు సంబంధించిన సెల్ ఫోన్ డాటాను పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదని తేలిందన్నారు. సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని సుమిత్రను తల్లిదండ్రులకు అప్పగించారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్‌బియ్యం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని వినయ్‌గార్డెన్స్ సమీపంలో ఆదివారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఐచర్ వ్యాన్‌ను పట్టుకున్నట్లు కాగజ్‌నగర్‌రూరల్ సీఐ నాగరాజు తెలిపారు. 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు జకారియా హుస్సేన్, మహ్మద్ ఖాజా, రఫీక్‌ఖాన్, ప్రసాద్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విషపూరిత నీటిని తాగి 20 మేకలు మృతి



మృతి చెందిన మేక

భీమారం: క్రిమిసంహారక మందులు చల్లిని వరిపొలంలో నీటిని తాగి 20 మేకలు మృతిచెందిన సంఘటన మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... యూసఫ్ ఇటుకల ఫ్యాక్టరీ వద్ద గల వరిపొలంలో సోమవారం సాయంత్రం మేకల మందలోని కొన్ని నీటిని తాగాయి. ఇంటికి వెళ్లే క్రమంలో నురగలు కక్కుతూ 20 మేకల వరకు మృతిచెందాయి. ఇందులో కొరివి రమేశ్‌కు చెందిన మేకలు ఆరు, చిల్కాని సునీల్ మూడు, చిల్కాని సాయిలు మూడు, చెర్ల సునీల్ రెండు, పూజరి రాజయ్య మూడు, ఎర్ర మల్లయ్యకు చెందిన మూడు మేకలు మృతి చెందగా మరికొన్ని అస్వస్థతకు గురయ్యాయి. గ్రామస్తుల సమాచారం మేరకు పశుసంవర్ధక శాఖ అధికారులు, పశువైద్య సిబ్బంది వెంటనే ఇందారం చేరుకుని చికిత్స అందిస్తున్నారు.

విద్యుత్ ఉచ్చులు నేరం

బెల్లంపల్లిరూరల్: విద్యుత్ ఉచ్చులు అమర్చి వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని బెల్లంపల్లి ఎఫ్ఆర్‌వో సుభాష్ అన్నారు. ఆదివారం రాత్రి బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి, దుబ్బపల్లి గ్రామాల శివారులోని పంట పొలాల్లో విద్యుత్ తీగల ఉచ్చులు అమర్చి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించిన స్థలాన్ని సోమవారం సిబ్బందితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతాల్లో, పంట పొలాల్లో విద్యుత్ తీగలు అమర్చడం చట్టరీత్యా నేరమన్నారు. వన్యప్రాణుల వేట కోసం విద్యుత్ తీగలు అమర్చినట్లు పలువురు పేర్కొనగా ఆ దిశగా విచారణ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌వో గౌరీశంకర్, బీట్ అధికారి రాజు ఉన్నారు.

ప్రమాదమా.. హత్యా..?



బావి నుంచి మృతదేహాన్ని బయటికి తీస్తున్న దృశ్యం



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- అనుమానాస్పదంగా ఇద్దరు యువకులు మృతి
- చంపి బావిలో పడేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ
- విచారణ చేపట్టిన పోలీసులు






కంబాల మహేశ్(ఫైల్) తుమ్మిడె హరీశ్(ఫైల్)

చింతలమానెపల్లి(సిర్పూర్): ఇద్దరూ ప్రాణ స్నేహితులు.. చిన్నతనం నుంచి కలిసి పెరిగారు.. అన్నింటా తోడుగా ఉన్నారు. ఏం జరిగిందో తెలియదు.. సాయంత్రం ఇంటి నుంచి బయటికు వెళ్లిన వారు మరుసటి రోజు ఉదయానికి ఊరి బయట బావిలో శవాలై కనిపించారు. ఈ ఘటన కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. చింతలమానెపల్లి మండల కేంద్రానికి చెందిన కంబాల బాపు, గంగుబాయి దంపతుల కుమారుడు కంబాల మహేశ్(22), మండల కేంద్రానికి సమీపంలోని ఖర్జెల్లి గ్రామానికి శంకర్, అమ్మక్క దంపతుల పెద్ద కుమారుడు తుమ్మిడె హరీశ్(22) ఇద్దరు స్నేహితులు. ఆదివారం సాయంత్రం వారు ఇద్దరు ఇళ్ల నుంచి బయటకు వెళ్లారు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం చింతలమానెపల్లి, ఖర్జెల్లి గ్రామాల మధ్య రహదారి పక్కన గల వ్యవసాయ భూమిలో హరీశ్ బైక్‌ను గుర్తించారు. సమీపంలోని బావిలో చెప్పులు కనిపించాయి. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. బావిలో గాలించడంతో ఇద్దరి మృతదేహాలు బయట పడ్డాయి. ఘటన స్థలానికి చేరుకున్న చేరుకున్న కౌటాల సీఐ సాదిక్ పాషా, ఎస్సై సురేశ్ వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు కౌటాల సీఐ సాదిక్ పాషా వెల్లడించారు.

పలు అనుమానాలు..

కంబాల మహేశ్, తుమ్మిడె హరీశ్ ఇద్దరు ఒకేసారి బావిలో శవాలై కనిపించిన ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చింతలమానెపల్లిలోని ఓ ఆలయంలో ఆదివారం సాయంత్రం మృతుల్లో ఒకరైన కంబాల మహేశ్ అన్నయ్య శ్రీనివాస్ వివాహం జరిగింది. ఈ వివాహం జరుగుతున్న సమయంలో ఫొటోలు తీసే విషయంలో వివాదం చోటుచేసుకుంది. ఈ విషయంలో అక్కడే ఉన్న వధువు తరఫున వారు కంబాల మహేశ్‌ను తీవ్రంగా బెదిరించినట్లుగా అతడి సోదరుడు శ్రీనివాస్ తెలిపాడు. మహేశ్‌ను వారే కొట్టి చంపి ఉంటారని ఆరోపించాడు. మరోవైపు ఘటనా స్థలం గ్రామానికి సుమారుగా కిలోమీటర్ దూరంలో ఉండగా.. అక్కడికి ఇద్దరు స్నేహితులు అకారణంగా వెళ్లే అవకాశం లేదని కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. ఇద్దరికీ మద్యం, ఇతర వ్యసనాలు లేవని చెబుతున్నారు. ఇద్దరి ఫోన్లు సాయంత్రం 7.30 నుంచి 8గంటల సమయంలో స్విచాఫ్ అయ్యాయని తెలిపారు. కలుపుగోలుగా తిరిగే ఇద్దరు యువకులు మృతి చెందడంతో చింతలమానెపల్లి, ఖర్జెల్లి గ్రామాల్లో విషాదం నెలకొంది. ఘటనా స్థలానికి రెండు గ్రామాల ప్రజలు చేరుకోగా మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

బాలశాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదం



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: పాఠశాల స్థాయి నుంచి విజ్ఞాన శాస్త్రంపై అవగాహన కల్పించడంతో పాటు బాలశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు పోటీలు దోహద పడుతాయని డీఈవో యాదయ్య తెలిపారు. ఫిబ్రవరి 28 జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా స్థాయి విజ్ఞానశాస్త్ర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్ పోటీలు ఉపయోగపడుతాయన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈ నెల 28 రవీంద్రభారతిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, న్యాయనిర్ణేతలుగా నారాయణరావు, ఆర్కే ప్రసాద్, శ్రీనివాస్, మూర్తి, జ్యోతి, మంజుల, మూర్తి, పోచయ్య పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జిని నిర్మించాలి

తాండూర్: మండల ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని డీప్రెస్ అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ ఎన్‌హెచ్ఏఐ రీజినల్ అధికారి ఎస్కే రజాక్‌ను కోరారు. సోమవారం మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే సదరు అధికారిని కలిశారు. ఈ సందర్భంగా తాండూర్ హైవేతో మండల ప్రజల ఇబ్బందులను ఎమ్మెల్యే వివరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ సభ్యులు సూరం రవీందర్ రెడ్డి, శంకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి ఈసా ఉన్నారు.

దుబార ఖర్చు తగ్గించాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో దుబార ఖర్చుల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఏరియా ఎస్వో టూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మందమర్రి ఏరియాలోని ఎంవీటీసీలో సోమవారం మల్టీ డిపార్ట్‌మెంటల్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థ స్థితిగతులను ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో ఎంవీటీసీ మేనేజర్ శంకర్, ఐఈడీ రాజన్న అధికారులు, జీఎం ఆఫీస్ సిబ్బంది ఉన్నారు.